సంక్షేమం.. అభివృద్ధే ధ్యేయంగా పాలన

• ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని గురువునాయుడుపేట సచివాలయం పరిధిలో గొలుగువలసలో సర్పంచ్ గొట్టాపు చిట్టెమ్మ వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గడప గడపకు మన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మూడేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు ద్వారా కలిగిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా... లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, పాత విద్యుత్ స్తంభాలు మార్చాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులను పిలిచి సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మూడేళ్లలో ఒక్క గొలుగువలస గ్రామంలో 110 కుటుంబాలకు సుమారు ఒక కోటి 50 లక్షల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ముఖ్యమంత్రి అందించారని తెలియజేశారు. అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్ 250 రూపాయలు పెంచి రూ.2,750 ఈ నెల నుంచి అందించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, జిల్లా కార్యదర్శులు పాచిపెంట వీరంనాయుడు, కొలువలపల్లి పెద్ది బాబు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు సనాపతి నారాయణరావు, కోటికిపెంట సర్పంచ్ ఇజ్జాడా అప్పలనాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బోను ధనుంజయ్, మూకల అప్పారావు, సత్తారపు రాము, బోను మురళి తదితరులు పాల్గొన్నారు.

అందరి బంధువు సీఎం జగన్

• ఎమ్మెల్యే జోగారావు



లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల బంధువుగా మారారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో అవ్వాతాతల కష్టాలకు స్పందించి వారికిచ్చిన హామీల మేరకు పింఛన్ పెంచారన్నారు. అవినీతికి తావు లేకుండా వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ చేయిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో సమాజంలో మార్పుకు నాంది పలికారన్నారు. మండలంలో మార్చి నెలాఖరు నాటికి బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. డిగ్రీ కళాశాల తీసుకురానున్నట్టు చెప్పారు. బలిజిపేట పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అభివృద్ధి పరచనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, తహసీల్దార్ సన్యాసిశర్మ, ఎంపీడీఓ భానుమూర్తి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు పి.మురళీక్రిష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యాన్ని చూపిస్తున్న రూరల్ ఎస్‌ఐ

సాలూరు: మండలంలోని పెదబొరబంద గ్రామంలో శ్రీనువాసరావు అనే వ్యక్తి తన ఇంటి నుంచి తరలించడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, వేరొకరికి విక్రయించడానికి సిమెంట్ బస్తాల్లో వేసి తన ఇంటి వద్ద శ్రీనువాసరావు సిద్ధంగా ఉంచిన 1270 కేజీల రేషన్ బియ్యాన్ని ముందస్తు సమాచారం మేరకు పట్టుకున్నామని తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకున్నామని దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ నీలకంఠం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ బి.రేణుక అధ్యక్షతన విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఎస్‌ఐ కె.నీలకంఠం మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల సమయం దగ్గర పడుతున్న వేళ విద్యార్థులు మంచిగా చదవాలన్నారు. విద్యార్థులు వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సదస్సులో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు టి.రవికుమార్, దాసరి రామకృష్ణ, ఆర్వీ ప్రసాదరావు, అధ్యాపకులు, హెచ్‌సీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



సంఘం ఎన్నికలో పాల్గొన్న కార్యదర్శులు

బలిజిపేట: మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. సంఘం అధ్యక్షుడిగా ఎ.గౌరీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వై.క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శులుగా వి.వెంకటినాయుడు, ఎస్.శ్రీహరి, కోశాధికారిగా ఎం.శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షులుగా ఎ.రామకృష్ణ, బి.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఎన్నిక పత్రాన్ని ఎంపీడీఓ భానుమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

సీతానగరం: ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి నిర్వాహకులకు ఇంజినీరింగ్ సహాయకులు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బి.క్రిష్ణమహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో ఇళ్ల నిర్మాణాలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్ల పనులు పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. అలాగే లే అవుట్లలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న చిన్నపాటి సమస్యలను త్వరలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాయితీపై ఇనుము, విద్యుత్ పరికరాలు, మరుగుదొడ్లు నిర్మాణానికి ముడిసరుకులు సమకూర్చిన విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని కోరారు.అనంతరం ఇంటి కోసం గంట సమయం కాన్సెప్ట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇంజినీరింగ్ సహాయకులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రమేష్

పార్వతీపురం టౌన్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ రమేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రహదారి భద్రతా నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రత, రక్షణ, అతివేగం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్‌ఐలు పాపారావు, సూర్యారావు, సిబ్బంది కిశోర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే జోగారావు



కోసరవానివలసలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. మండలంలో డీకే పట్టణ పరిధిలో అడారు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి, రైతు భరోసా, పింఛన్ అందుతుందా.. లేదా.. అని ఆరా తీశారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడం వల్ల ప్రజలకు సేవలు సత్వరమే అందుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తుందన్నారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్టు తెలిపారు.

అర్థంలేని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలు

ప్రతీ కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న నాయకులు బాదుడే బాదుడు అంటూ మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టడం విచాకరమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల్లో 8రకాల వైద్య పరీక్షలు



బందలుప్పి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

పార్వతీపురం టౌన్: గ్రామాల్లో ఎనిమిది రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని బందలుప్పి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అవసరమైన వారికి వైద్యపరీక్షలు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ 15రోజులకొకసారి గ్రామంలో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో 8రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని,రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా త్వరగా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. మండలంలో పలు గ్రామాల్లో రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు మందకొడిగా జరుగుతుందన్నారు. కళ్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాతావరణం బాగాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మనమే టాప్



నూతన ఫించన్లు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

• ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని బాగువలస గ్రామంలో సర్పంచ్ రెడ్డి సుకన్య అధ్యక్షతన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మండల స్థాయి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులకు రూ.2750లు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పెంచి లబ్ధిదారులకు అందజేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకునేవారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీపీ గురుగుబల్లి రాములమ్మ, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, గ్రంథాలయ జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ చైర్మన్ బంకురు శ్రీనువాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనువాసరావు తదితరులు ఉన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు వేయాలి : ఎస్‌ఈ



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఎస్‌ఈ కృష్ణాజీ

పార్వతీపురం టౌన్: విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు, జిల్లా పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఎంవీఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వేదశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కారాదన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ ఆర్.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

పార్వతీపురం టౌన్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఫిబ్రవరి 11వ తేదీన జిల్లా కోర్టునందు నిర్వహించనున్నట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే ఉత్తమ మార్గమని, కేసులు పరిష్కరించుకుని డబ్బు, సమయం ఆదా చేసుకోవాలన్నారు.

సార్వత్రిక టీకాతో ఆరోగ్యం

• జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహనరావు



వ్యాక్సిన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

సీతానగరం: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన సార్వత్రిక టీకా విధిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని బూర్జ, లక్ష్మీపురం, పెదబోగిల, జోగింపేట గ్రామాల్లో వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల సార్వత్రిక టీకా కార్యక్రమం షెడ్యూల్‌లో ఎఫ్ఐపీవీ టీకా అదనపు డోసును వైద్య ఆరోగ్య శాఖ ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టిందన్నారు. పెదంకలాం, సీతానగరం ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 20 మంది పిల్లలకు ఈ టీకా వేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ టీకా మూడో డోసు అర్హులైన పిల్లలకు వేస్తున్నట్టు తెలిపారు. పోలియోను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ఈ డోసు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివరాల నివేదికను సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, జోగింపేట సర్పంచ్ కల్యాంపూడి సింహాచలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వసతిగృహం ప్రారంభం



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పి.గంగమ్మ

పాచిపెంట: మండలంలోని కరకవలస పంచాయతీ అమ్మవలసలో నీడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వసతిగృహాన్ని స్థానిక సర్పంచ్ పెద్దింటి గంగమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి వేణుగోపాలరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు వలస కార్మికుల కుటుంబాల పిల్లలను అన్ని రకాలుగా ఆదుకుని వారికి నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో సీజనల్ వసతిగృహాన్ని ప్రారంభించామన్నారు. వీరికి విద్యా బోధన చేసేందుకు ఉపాధ్యాయులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక స్కూల్ హెచ్‌ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయుడు తవిటిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు



ఏగోటివలస జగనన్న కాలనీల్లో అమర్చిన విద్యుత్ స్తంభాలు

సీతానగరం: మండలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్న జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు జోరందుకున్నాయి. ఈ పనులు వేగవంతం చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు అన్నారు. ఏగోటివలస, జోగంపేట గ్రామాల జగనన్న లేఅవుట్‌లలో జరుగున్న పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సొంతిళ్లు లేని పేదలను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో విద్యుత్ పనులు వేగవంతం చేశామన్నారు.

• పరామర్శ



రెడ్డి తిరుపతినాయుడును పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి తిరుపతినాయుడును ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర బుధవారం పరామర్శించారు. మండలంలోని బాగువలస గ్రామంలో తిరుపతినాయుడు ఇంటికి వెళ్లిన రాజన్నదొర ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎంపీపీ గరుగుబల్లి రాములమ్మ, వైస్ ఎంపీపీ సువ్వాడ గుణవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



సీతానగరం: లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ప్రారంభిస్తున్న సహిత ఉపాధ్యాయులు

సీతానగరం: ప్రపంచంలోనే అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన శాస్త్రీయవాది, మేధావి లూయిస్ బ్రెయిలీని స్ఫూర్తిగా తీసుకుని భవిత కేంద్ర నిర్వాహకులు సేవలందించాలని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో భవిత విద్యార్థులతో కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. అంధుల అక్షర దాతగా పేరుగాంచిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవిత కేంద్రం నిర్వాహకులు, సహిత విద్యా ఉపాధ్యాయులు క్రిష్ణమోహనరావు, ఉన్నత పాఠశాల సహిత విద్యా ఉపాధ్యాయిని రేణుకాదేవి, చంద్రకళ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సత్యం, భవిత కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎ.పద్మావతి ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం నిర్వహించారు. లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు రామకృష్ణ, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.